# కించిత్ భోగం!

అర్ధరాత్రి పన్నెండయింది. పట్టుమీది కోడిపెట్టలా వుంది ఊరు. ఆకాశంలో మబ్బుల వెనక చంద్రుడు "వీల్డ్ రెబెకా" అల్లే వున్నాడు. మంచు కప్పిన "హుసేన్‌సాగర్ చెఱువు" మయసభలోని దుర్యోధనుడి మడుగల్లే వుంది. "టాంక్ బండ్" విషం తీసిన త్రాచల్లే వుంది. పావురం రెట్టలతో పాడయిన పాత గోడలా వున్నాడతను పడుకున్న పాము మీదకి పాకుతున్న చీమలాగా టాంక్ బండ్ మీదకి చేరాడు.

ప్రొద్దుటి నుంచీ తిరిగి తిరిగి, విసిగి విసిగి వున్నాడేమో, టాంక్‌బండ్ అరుగు మీద గుడ్డ పరిచి మెల్లగా నడుం వాల్చాడు. ఒళ్ళు తేలిపోయినట్టనిపించింది. చుక్కలు కనబడ్డాయి. మనస్సు వెక్కిరించింది. చంద్రుడు దోబూచులాడుతున్నాడు. నిద్రాదేవి ముద్దాడుతోంది.

ఇంతలో హఠాత్తుగా ఓ మారుతీకారు సర్రున వచ్చి ఆగింది. ఉలిక్కిపడి చూశాడు. తెల్లగా వున్న కారుకి మధ్యలో పొడుగునా నల్లగీత కారు తలుపు తెరుచుకుంది. పాలరాయి బొమ్మ దిగింది. కళ్ళార్పకుండా చూడసాగాడతను. పాలరాయి బొమ్మ అడుగులు వేయసాగింది. ఆ ఒక్కొక్క అడుగు అతని ప్రాణాల మీద పడుతున్నట్టుంది. అతని ప్రక్కన వచ్చి నిలబడిందామె! అతనికేం చేయాలో తోచలేదు. కదల్లేదు, లేవలేదు, ఊరికే అలా చూడసాగాడు.

"చలేయడం లేదూ?" అడిగిందామె

చాలా ప్రయత్నం మీద తల ఊపాడతను.

"ఆకలేస్తోందా?" అడిగింది


మళ్ళీ తల వూపాడతను.

"నా వెంట వస్తావా?" ఆమె గొంతు

అతని తల ఊగింది.

"లే" ఆజ్ఞాపించింది ఆమె కంఠం.

లేచాడు. కారెక్కాడు. కారు కదిలింది. కదిలిన కారు ఓ పెద్ద పాలరాయి భవనం ముందు ఆగింది. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. ఆ పాలరాళ్ళ మధ్య కలిసిపోయిందామె. అతనికి భయం వేసింది. ఆ నల్లని కురులే లేకపోతే ఆమె కనబడేదే కాదు ఆ రాళ్ళల్లో.



ఓ వజ్రంతో గడ్డం చేసుకున్నాడు అతను. పన్నీటితో స్నానం చేయించింది ఆమె. మల్లెపూలలాటి పంచె, లాల్చీ తొడిగాడు.

చిన్న ప్లే గ్రౌండంత డైనింగ్‌హాలు రెండు టేబుల్ టెన్నిస్ టేబుళ్ళంత డైనింగ్ టేబుల్! యాభైరకాల పదార్థాలు ఎంత తిన్నా త్రేణుపు రాలేదు. లేచాడు. లవంగాలు, ఏలక్కాయలు, జాజికాయ, జాపత్రి, పచ్చ కర్పూరం, కుంకుమపువ్వు, కస్తూరి, తుని ఆకులు, చలువ మిరియాలు, ఓహ్! తాంబూలం బిగించాడు. కాస్సేపు బాల్కనీలో పచార్లు చేశాడు. మంచం మీద వాలాడు. హంస ఈకల పరుపు, ముఖమల్ దుప్పటి! పట్టు దిళ్ళు, నిద్రరావడం లేదు! ఏమిటి ఆశ్చర్యం! కలా! నిజమా! గిల్లుకున్నాడు, ఏమీ తెలియడంలేదు.

ఇంతలో ఆమె వచ్చింది. పచ్చని గులాబీ గౌనులోంచి పాలరాయి మడతలు నిగనిగలాడుతున్నాయి. అతని రెప్పలు రెపరెపలాడడం లేదు.

"ఇప్పుడు ఆకలేస్తుందా?" అడిగిందామె

వేస్తుందనాలనిపించిందతనికి కాని "లేదు" అన్నాడు.

"చలేస్తోందా" అడిగింది.

వెయ్యడం లేదు కాని, వెచ్చదనం కావాలి అందామని నోటిదాకా వచ్చింది "లేదు" అన్నాడు బలవంతాన

"పక్క యిబ్బందిగా వుందా?"

"పక్కన నువ్వు లేకపోతే యిబ్బందిగానే వుంది" తెగించి అనేశాడు.

"అయితే కొంచెం అటు జరుగు" ఆమె మత్తుగా అంది.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరయాడు అతను.

జరిగాడు.

"మరికొంచెం జరుగు" అంది నవ్వి.

మరికొంచెం జరిగాడు...హుసేన్‌సాగర్‌లో పడ్డాడు.